

## మళ్లీ పెరిగిన పుత్తడి

న్యూఢిల్లీ, మే 2: బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు దేశీయంగా ఆభరణాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా పుత్తడి ధర రూ.96 వేల మార్క్‌ను అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.1,080 ఎగబాకి రూ.96,800 పలికింది. గురువారం భారీగా తగ్గిన ధరలు మళ్లీ ఆ మరుసటి రోజే పెరగడం విశేషం. స్థానిక ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని ట్రేడర్ వెల్లడించారు. పసిడితోపాటు కిలో వెండి రూ.1,600 ఎగబాకి రూ.97,100 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 23.10 డాలర్లు పెరిగి 3,262.30 డాలర్లకు చేరుకోగా, వెండి 32.49 డాలర్లుగా ఉన్నది.

## ఆడీ కార్లు ప్రియం

న్యూఢిల్లీ, మే 2: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ ఇండియా మరోసారి ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల మాడళ్ల ధరలను రెండు శాతం వరకు సవరిస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతోపాటు ఎక్స్ఛేంజ్ రేట్లలో మార్పులు చోటు చేసుకోవడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని తెలిపింది.


## విక్రయదారులకు అమెజాన్ దన్ను

హైదరాబాద్, మే 2: దేశవ్యాప్తంగా ఉన్న చిన్న స్థాయి విక్రయదారులకు అమెజాన్ శుభవార్తను అందించింది. రూ.300 కంటే తక్కువ ధర కలిగిన ఉత్పత్తులపై రెఫరల్ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో విక్రయదారులు తక్కువ ధర కలిగిన వస్తువులపై గణనీయమైన రీతిలో పొదుపు చేసుకునేందుకు అవకాశం లభించనున్నదని అమెజాన్ ఇండియా సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. దుస్తులు, బూట్లు, ఫ్యాషన్ నగలు, గృహోపకరణాలు, వంటగదికి సంబంధించి 135కి పైగా రంగాలకు చెందిన ఉత్పత్తులకు ఈ నిర్ణయం వర్తించనున్నది. తెలంగాణ నుంచి 50 వేల మంది విక్రయదారుల నుంచి సేకరించి తమ ఉత్పత్తులను అమెజాన్‌లో విక్రయిస్తున్నాయి.

# వృద్ధికి టారిఫ్ దెబ్బ

**ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ అంచనాను తగ్గించిన ఎస్అండ్‌పీ**

- *6.5 శాతం నుంచి 6.3 శాతానికి కోత*
- *ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం*
- *ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి రూపీ పతనం!*




న్యూఢిల్లీ, మే 2: భారత జీడీపీ అంచనాలకు ప్రముఖ గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ కోత పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను దేశ వృద్ధిరేటు 6.3 శాతంగానే ఉండొచ్చని శుక్రవారం పేర్కొన్నది. ఇంతకుముందు అంచనా 6.5 శాతంగా ఉండటం గమనార్హం. 'ప్రపంచ స్థూల ఆర్థిక వ్యవస్థ సమాచారం: ఆర్థిక వృద్ధిని నెమ్మదింపజేస్తున్న అమెరికా వాణిజ్య విధానంలోని భారీ మార్పులు' పేరిట ఓ నివేదికను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తాజాగా విడుదల చేసింది. ఈ సందర్భంగానే గతంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి పేర్కొన్న అంచనాలను సవరించింది.

### ట్రంప్ సుంకాల సెగ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలకు తెరలేపడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. అయితే చైనా మినహా మిగతా దేశాలపై విధిస్తామన్న టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేయడం కొంతలోకొంత ఊరటనిచ్చింది. ఈ క్రమంలోనే భారత్‌సహా ఆయా దేశాలు.. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే పనిలోపడ్డాయి. అయినప్పటికీ ఈ ట్రేడ్ వార్‌పై అనిశ్చిత పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉండటంతో.. ఆ సెగ ఇప్పుడు దేశ జీడీపీ అంచనాకు తాకింది. నిజానికి ఈ ఏడాది మార్చిలోనే దేశ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.5 శాతంగానే ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంచనా వేసింది. అంతకుముందు ఇది 6.7 శాతంగా ఉంటుందన్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో 0.2 శాతం మేర తగ్గొచ్చని ప్రకటించింది. ఈ లెక్కన చూసుకుంటే జీడీపీ అంచనాకు దాదాపు అర శాతం కత్తెర పడినట్టే అనుకోవచ్చు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) దేశ జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంటున్నది.

### రూపాయి అధోగతే..

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి దిగజారవచ్చని ఎస్అండ్‌పీ ఈ సందర్భంగా తమ రిపోర్టులో పేర్కొన్నది. ప్రస్తుతం 84.57 వద్ద రూపీ వాల్యూ కదలాడుతుండగా.. 2024 చివర్లో 85.64 వద్ద ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటి దాకానైతే రూపాయి మారకం విలువ రూపాయికిపైగానే కోలుకున్నట్టు కనిపిస్తున్నది. అయితే గడిచిన ఈ 4 నెలల్లో తీవ్ర ఒడిదొడుకులనూ చవిచూసింది. ఫిబ్రవరి 6న మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి క్షీణించింది. ఒకానొక దశలో 87.60 స్థాయినీ తాకింది. ఈ నేపథ్యంలో ఎస్అండ్‌పీ అంచనా మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. మళ్లీ రూపాయి ఒత్తిడికి లోనవబోతున్నదన్న సంకేతాలనిస్తున్నది.

**2025-26కుగాను దేశ జీడీపీ అంచనాలకు కోతలు**

| సంస్థ | ప్రస్తుతం | మునుపు |
|---|---|---|
| ఆర్బీఐ | 6.5% | 6.7% |
| ఫిచ్ | 6.4% | 6.5% |
| ఓఈసీడీ | 6.4% | 6.9% |
| ఎస్అండ్‌పీ | 6.3% | 6.5% |
| ప్రపంచ బ్యాంక్ | 6.3% | 6.7% |
| ఐఎంఎఫ్ | 6.2% | 6.5% |
| మూడీస్(2025) | 6.1% | 6.4% |

- ఈ ఏడాది అమెరికా జీడీపీ వృద్ధిరేటు 1.5 శాతంగా, వచ్చే ఏడాది 1.7 శాతంగా ఉండొచ్చంటున్న ఎస్అండ్‌పీ.
- **చైనా జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది 0.7 శాతం తగ్గి 3.5 శాతానికే పరిమితం కావచ్చు. వచ్చే ఏడాదైతే 3 శాతంగానే ఉండొచ్చని అంచనా.**
- అమెరికాతో సుంకాల సమరానికి బదులుగా చాలా దేశాలు వాణిజ్య ఒప్పందాలనే చేసుకునే వీలుందంటున్న ఎస్అండ్‌పీ.
- **అమెరికా, యూరప్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు సంక్లిష్టం కావచ్చు. కఠిన వైఖరికే మొగ్గుచూపుతున్న కెనడా.**
- పరస్పర ప్రతీకార సుంకాలతో ఏ దేశానికీ లాభం ఉండదంటున్న ఎస్అండ్‌పీ. ఈ తరహా రక్షణాత్మక ధోరణులు మంచివికావని హితవు.



## టాప్‌గేర్‌లో క్రెటా విక్రయాలు

న్యూఢిల్లీ, మే 2: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్‌కు చెందిన ఎస్‌యూవీ మాడల్ క్రెటా మరో మైలురాయిని సాధించింది. వరుసగా రెండో నెల ఏప్రిల్‌లోనూ అత్యధికంగా అమ్ముడైన వాహనాల్లో తొలిస్థానంలో నిలిచింది. గత నెలలో 17 వేల యూనిట్ల క్రెటా వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 10 శాతం వృద్ధిని కనబరిచాయి. సంస్థ మొత్తంగా 69,914 యూనిట్ల వాహనాలను విక్రయించగా, వీటిలో ఎస్‌యూవీ వాటా 71 శాతంగా ఉన్నదని పేర్కొంది. ఈ వాహనంపై కస్టమర్లు పెట్టుకున్న నమ్మకానికి ఇది నిదర్శనమని కంపెనీ సీవోవో, డైరెక్టర్ తరుణ్ గార్గ్ తెలిపారు. క్రెటాతోపాటు వెన్యూ, ఎక్స్‌టర్, అల్కాజర్, ఇతర మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. పదేండ్ల క్రితం దేశీయ రోడ్లపైకి అందుబాటులోకి వచ్చిన ఈ మాడల్‌కు 12 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.

## అమెరికాలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లు

- **యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడి**

న్యూఢిల్లీ, మే 2: అమెరికాలో అమ్ముడుకానున్న ఐఫోన్లలో భారత్‌లో తయారైనవే అత్యధికంగా ఉండనున్నాయని యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడించారు.



వరుసగా ఏడో త్రైమాసికంలోనూ చైనాలో ఐఫోన్ల అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో సంస్థ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. ఒకవైపు ప్రతీకార సుంకాలు విధిస్తుండటంతో భారత్‌లో తయారవుతున్న ఐఫోన్లను భారీగా దిగుమతి చేసుకోవాలని చూస్తున్నది సంస్థ. జూన్ త్రైమాసికం నాటికి యూఎస్‌లో అమ్ముడుకానున్న అత్యధిక ఐఫోన్లలో భారత్ నుంచి దిగుమతి చేసుకునేవే ఉండనున్నాయని, అలాగే వియత్నాం నుంచి ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచెస్, ఎయిర్‌ప్యాడ్స్ ఉండనున్నాయని చెప్పారు. 2024లో అమెరికాలో 75.9 మిలియన్ల ఐఫోన్లు అమ్ముడయ్యాయి. ఇప్పటికే యునైటెడ్ స్టేట్స్‌కు భారత్ నుంచి అత్యధికంగా ఐఫోన్లు ఎగుమతి అవుతున్నాయని, ఫిబ్రవరితో ముగిసిన మూడు నెలలకాలంలో ఎగుమతులు 82 శాతం పెరిగాయని, ఇదే క్రమంలో మార్చి నాటికి 97.6 శాతానికి చేరుకున్నాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటిలిజెన్స్ తన నివేదికలో వెల్లడించింది. మార్చితో ముగిసిన రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 90.75 బిలియన్ డాలర్ల నుంచి 95.35 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.

## కోలుకున్న స్టాక్ మార్కెట్లు

**సెన్సెక్స్ 260, నిఫ్టీ 12 పాయింట్ల లాభం**




ముంబై, మే 2: దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. అమెరికా-భారత్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశాలుండటం, రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లుకావడం మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఎగబడి కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లు ఆశాజనకంగా ట్రేడవడంతో సూచీలకు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇంట్రాడేలో 900 పాయింట్లకుపైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 259.75 పాయింట్లు అందుకొని 80,501.99 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 12.50 పాయింట్లు పెరిగి 24,346.70 పాయింట్లకు చేరుకున్నది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో అదానీ పోర్ట్ షేరు 4 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, మారుతి, టాటా మోటర్స్, ఐటీసీ, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ముగియగా..నెస్లె, ఎన్టీపీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్, టైటాన్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా సర్వీసెస్ 1.67 శాతం అధికంకాగా, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..టెలికం, కన్స్యూమర్ డ్యూరబుల్, పవర్, యుటిలిటీ, మెటల్, రియల్టీ రంగ షేర్లు నష్టపోయాయి.

## సర్కారీ అప్పులు తగ్గాలి

- **అప్పుడే దేశ క్రెడిట్ రేటింగ్ జూమ్**
- **డీఈఏ కార్యదర్శి అజయ్ సేథ్**

న్యూఢిల్లీ, మే 2: దేశ రుణ భారం చాలా ఎక్కువగా ఉందని, ఇది తగ్గాలని.. అప్పుడే గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు భారత క్రెడిట్ రేటింగ్‌ను పెంచుతాయని ఆర్థిక వ్యవహారాల (డీఈఏ) కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు. ఈ సర్కారీ అప్పులపై చెల్లించే వడ్డీ భారం కూడా మోయలేనివిధంగా తయారవుతున్నదని, దాన్ని దించుకోవాల్సిన అవసరం ఎంతో ఉన్నదనీ ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఐఎస్‌ఏఈసీ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ కాన్ఫరెన్స్‌లో అజయ్ మాట్లాడుతూ.. అప్పులు పెరుగుతూపోవడం మంచిదికాదన్నారు. రేటింగ్ అప్‌గ్రేడ్ కోసం రేటింగ్ ఏజెన్సీలతో భారత్ ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తోందని వివరించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడానికి మితిమీరిన రుణ భారమేనంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఖర్చులకు సంబంధించి స్పందిస్తూ.. చాలావరకు సమతూకం లోపించిందన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభివృద్ధి కంటే రుణ నిధులను వ్యయాలను పెంచుకోవడానికే వినియోగిస్తున్నాయన్నారు. కాగా, ట్యాక్స్-టు-జీడీపీ రేషియో 20 శాతానికి చేరాలంటే 5-6 ఏండ్లు పట్టవచ్చన్నారు.

## బ్యాంకులపై ఆర్బీఐ భారీ జరిమానా

ముంబై, మే 2: నాలుగు బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ షాకిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకుగాను ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాతోపాటు మరో రెండు బ్యాంకులపై భారీ స్థాయిలో జరిమానా విధించింది. వీటిలో ఐసీఐసీఐ బ్యాంక్‌పై రూ.97.80 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.61.40 లక్షలు, ఐడీబీఐ బ్యాంక్‌పై రూ.31.8 లక్షలు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రపై రూ.31.80 లక్షల చొప్పున విధించింది. కేవైసీ నిబంధనలు పట్టించుకోకపోవడం, సైబర్ సెక్యూరిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్లనే జరిమానా విధించింది.

## భారత్‌మాల బాధితులకు న్యాయం చేకూర్చాలి

మక్తల్, మే 2: భారత్ మాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులందరికీ ప్రభుత్వం నుంచి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఎంపీ డీకే అరుణను కలిసి వినతిపత్రం అందజేసినట్లు భారత్‌మాల బాధితుడు రామలింగం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019లో భారత్‌మాల రోడ్డు నిర్మాణానికి నోటిఫికేషన్ ప్రకటించి, మా పొలాలను బ్లాక్ లిస్టులో పెట్టి ఇప్పటివరకు నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ రహదారి పెద్దచింతకుంట నుంచి కర్ణాటకలోని దేవర వరకు నిర్మాణం జరుగుతుందని, ఈ రోడ్డు నిర్మాణం విషయంలో ప్రాజెక్టు ఆర్వో, పీడీ కలిసి కాలయాపన చేయడంతో భారత్‌మాలలో భూమి కోల్పోతున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన వస్తుందని వాపోయారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిని వీడి రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని ఎంపీ డీకే అరుణను కలిసినట్లు పేర్కొన్నారు. ఎంపీ స్పందించి భారత్ మాల అధికారులతో ఫోన్లో మాట్లాడి వీలైనంత త్వరగా పరిహారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును

**టెండర్ నెం.10-GSU-25-26-Sr.DEE-M-HYB**

PUB/0490

దిగువ టెండర్లు ముగింపు **తేది: 27-05-2025న 15.00** గంటలకు సంబంధించి భారత రాష్ట్రపతి తరపున వ్యవహరిస్తున్న Sr.DEE/M/HYB వారు ఇ-టెండర్లు కోరుతున్నారు. బిడ్డర్లు తమ ఒరిజినల్/ రివైజ్డ్ బిడ్లను ముగింపు తేది మరియు సమయం వరకు మాత్రమే దాఖలు చేయగలుగుతారు. ఈ టెండరుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు ఏదేని అటువంటి మాన్యువల్ ఆఫర్ స్వీకరించినప్పటికీ తిరస్కరించబడుతుంది.

**1. పని వివరణ:** టెండర్ నెం.**10-GSU-25-26-Sr.DEE-M-HYB**:హైదరాబాద్ డివిజన్: MBNR - DHNE మధ్య లైన్ డబ్లింగ్‌కు సంబంధించి PF No.1 మరియు ప్రస్తుతమున్న MBNR స్టేషన్ బిల్డింగ్ పునఃనిర్మాణం- విద్యుత్ ఏర్పాట్లు. **సుమారు వ్యయం:** రూ.2,05,85,220/-, **బయానా:** రూ.2,52,900.00, **పూర్తిచేయు కాలం:** 12 నెలలు, ముగింపు తేది: 27-05-2025

**వెబ్‌సైట్ వివరాలు:** www.ireps.gov.in

**టెండరు పూర్తి వివరాలు చూసేందుకు నోటీసు బోర్డ్ ప్రదేశం:** Sr.DEE/M/HYB, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్-500071 వారి కార్యాలయం.

**సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, హైదరాబాద్**


A0615

**తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.**

## బియ్యం దొంగలు పరార్

- **రూ.కోట్లు తిన్నట్లు ఆరోపణలు**
- **అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చేలోగా జారుకున్నట్లు పుకార్లు**
- **ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు**


గద్వాల అర్బన్, మే 2 : సీఎంఆర్ బియ్యం వ్యవహారంలో గతనెలలో ఒక వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన వ్యవహారం విదితమే. అయితే ఈ వ్యవహారానికి సంబంధించి నమస్తే తెలంగాణలో తప్పొకరిది.. శిక్ష మరొకరికి కథనం వెలువడడంతో పోలీస్ యంత్రాంగం దీనిపై లోతుగా విచారణ చేపట్టినట్లు సమాచారం. అసలు వివరాలిలా.. 2021-22 యాసంగి సీజన్‌కు సంబంధించిన వడ్లు పెద్ద మొత్తంలో పక్కదారి పట్టినట్లు ఆరోపణలు రావడంతో పత్రికలలో అనేక కథనాలు వెలువడ్డాయి. ఈ వ్యవహారానికి సంబంధించి పౌరసరఫరా అధికారులు దృష్టిసారించి వ్యవహారంపై ఆరాతీసి వివరాలు సేకరించారు. అనంతరం గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో గద్వాల మండలంలోని కాకులారంలోని శ్రీకృష్ణ రైస్‌మిల్లుపై ఫిర్యాదు చేయడంతో 2023లో అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసుకు సంబంధించి అన్ని విషయాలు ఆరాతీసి గతనెలలో రైస్‌మిల్లు యాజమాని కృష్ణయ్యగౌడ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్ చేశారు. అయితే ఈ వ్యవహారంలో కృష్ణయ్యగౌడ్ తప్పు లేకపోయినప్పటికీ మిల్లు యాజమాని అని ఒకేఒక ఉద్దేశంతో ఆయనపై చర్యలు తీసుకున్నట్లు గుసగుసలు వినబడుతున్నాయి. కృష్ణయ్యగౌడ్‌తో దౌదర్‌పల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు మిల్లును లీజుకు తీసుకుని సీఎంఆర్ వడ్లు నడిపినట్లు పోలీస్‌ల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. వాస్తవానికి సీఎంఆర్ వడ్ల వ్యవహారానికి సంబంధించి అన్ని విషయాలు దౌదర్‌పల్లికి చెందిన వ్యక్తులే నడిపినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకున్న వడ్లను మర అడించి ప్రభుత్వానికి అందించాలి. అయితే కొనుగోలు నుంచి తీసుకున్న వడ్లను కొన్ని ప్రభుత్వానికి అందించి మిగతా వాటిని పక్కదాడి పట్టించి రూ.కోట్లు మింగిసేనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో మిల్లు యాజమానిని అదుపులోకి తీసుకొని ఆరా తీయగా.. అసలు నిజాలు బయట పడినట్లు తెలిసింది. ఇందులో ఎవరెవరు ఉన్నారో.. వారి వివారలు సేకరించే ప్రయత్నంలో పోలీస్‌లు నిమగ్నమయ్యారు. తమ గురించి ఆరా తీస్తున్నారన్న విషయం తెలుసున్న బియ్యం దొంగలు పరారైనట్లు జిల్లాలో పుకార్లు షికార్లు అవుతున్నాయి. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు వేట కొనసాగిస్తున్నట్లు తెలిసింది. అసలు దొంగలు పట్టుబడితే వారిని కూడా రిమాండ్‌కు తరలించేందుకు పోలీస్ అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది.



### త్వరలో పట్టుకుంటాం..

ఈ కేసుకు సంబంధించి అన్ని విషయాలు క్షుణ్ణంగా పరిశీలించి అందుకు తగ్గుట్లు వ్యవహరిస్తున్నాం. ఇప్పటికే ఒకరిని రిమాండ్‌కు తరలించాం. ఇందులో ఇంకా ఎంత మంది ఉన్నా రో.. అందరి గురించి ఆరా తీస్తున్నాం. త్వరలో వారిని కూడా పట్టుకుంటాం. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి. ఈ కేసులో ఎవరిని వదలిపెట్టే ప్రసక్తి లేదు.

*- శ్రీను, సీఐ, గద్వాల*



# చెయ్యిచ్చినోళ్లకే..

- **కాంగ్రెస్‌కు ఓటేసినోళ్లకే సంక్షేమ పథకాలు**
- **గుందిమల్లలో దేవుడి మాన్యంలో ఇందిరమ్మ ఇండ్లకు మార్కింగ్**
- **అనర్హులను ఎంపిక చేశారని ఆరోపణలు**

అలంపూర్, మే 2 : ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇప్పటికే ఒకసారి దరఖాస్తులు, మరోసారి గ్రామసభలంటూ కాంగ్రెస్ సర్కారు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నది. అంతేకాకుండా పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి మొదటగా అక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తామని బుకాయించింది. తీరా జాబితాలు సిద్ధం చేసి 100 రోజులు గడుస్తున్నా నేటికి ఒక్క అడుగు ముందుకు పడలేదు. అలంపూరు మండలం గుందిమల్లను పైలెట్ గ్రామంగా ఎంపికచేశారు. గ్రామంలో 391 ఇండ్లకుగానూ 1,433 మంది జనాభ ఉన్నారు. వారిలో 1,320 మంది ఓటర్లు ఉండగా, అందులో 650 మంది పురుషులు, 670 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అత్మీయ భరోసా పథకంలో 67మందిని గుర్తించగా ఐదుగురి దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, 61మందిని గుర్తించారు. రైతుభరోసా పథకంలో 745 హెక్టార్లకు గానూ 329మంది రైతులను గుర్తించారు. రేషన్‌కార్డుల కోసం 61మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 42మందిని గుర్తించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి 391 దరఖాస్తులు రాగా, 379 కుటుంబాలను సర్వే చేశారు. వారిలో లిస్టు-1 లో 69మంది, లిస్టు-2లో 3, లిస్టు-3లో 14మందిగా మొత్తం 86మందిని అర్హులుగా గుర్తించారు. కాగా, అర్హుల ఎంపికలో నిజమైన లబ్ధిదారులు లేరని, ఇదివరకే ఇండ్లు ఉన్న కాంగ్రెస్ నాయకులకే ఇచ్చి పేదలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.



ఎంపీడీవో మాట్లాడుతున్న బాధితులు

### అనర్హులకే పథకాలు ఇచ్చారు..



అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు తలొగ్గి అనర్హులకే సంక్షేమ పథకాలు ఇస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామ శివారులోని 199 సర్వేనెంబర్‌లో దేవుడి మాన్యం భూముల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ముగ్గులు పోశారు. ఇంటి స్థలాలున్న వారిని గుర్తించకుండా అధికార పార్టీ వారికే లిస్టులో పేర్లున్నాయి. దేవుడి మాన్యాలను కాపాడాలని అధికారులను కోరాం. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి న్యాయం చేయాలి.

*- రఫీ, గుందిమల్ల, అలంపూర్ మండలం*

### కాంగ్రెస్‌కు ఓటేయలేదని లిస్టులో పేరు తీశారు..



కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయలేదని లిస్టులో నా పేరు వచ్చినా తర్వాత తీసేశారు. నాకు కేసీఆర్ సారంటే అభిమానం. పార్టీలను చూసి సంక్షేమ పథకాలు ఇచ్చుకుంటూ పోతే ప్రజాస్వామ్యమని అంటారా. అర్హులను గుర్తించి పథకాలు ఇవ్వాలే తప్పా ఈ పార్టీ, ఆ పార్టీ అంటే ప్రజాపాలనకు అర్థమేమున్నది. మట్టి మిద్దెలుండి ఎప్పుడు కూలుతాయో తెలియదు. అర్హులను గుర్తించి ఇండ్లు ఇవ్వాలి.

*-శేఖర్, గుందిమల్ల*

### అర్హులకు న్యాయం చేస్తాం

సంక్షేమ పథకాల్లో అర్హులకే సంక్షేమ పథకాలు అందిస్తాం. ఎక్కడైనా తప్పిదాలు జరిగితే ఫిర్యాదుల మేరకు సరిచేస్తాం. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉంటుంది. బుక్కాపురం, జిల్లెలపాడు, ఊట్కూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గుందిమల్లలో బేస్‌లెవల్ వరకు నిర్మాణాలైన నలుగురికి రూ.లక్ష చొప్పున డబ్బులు ఇవ్వడం జరిగింది. ఆన్‌లైన్ యాప్ సరిగా పనిచేయకపోవడం వల్ల మరి కొంత మందికి బిల్లులు చెల్లించలేకపోయాం. 33మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాల కోసం మార్కింగ్ ఇచ్చాం.

*- పద్మావతమ్మ, ఎంపీడీవో*

### దేవుడి మాన్యంలో ఇండ్లకు మార్కింగ్..



గ్రామ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయ మాన్యం భూముల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అధికారులు మార్కింగ్ చేస్తున్నారు. అర్హులకు కాకుండా అనర్హులకు ఇండ్లు ఇచ్చేందుకు గోల్‌మాల్ చేస్తున్నారు. అధికారులు మాన్యం భూములను కాపాడాలి.

*-లక్ష్మణ్‌నాయుడు, గుందిమల్ల*

## కేజీబీవీ అప్‌గ్రేడ్

ఉప్పునుంతల, మే 2 : మండలకేంద్రంలో కేజీబీవీ పాఠశాల కాలేజీగా అప్‌గ్రేడ్ అయిందని పాఠశాల ప్రత్యేకాధికారిణి సైదా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో చదివిన విద్యార్థులకు, అదే విధంగా తల్లిదండ్రులు లేని విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మండల విద్యార్థులకు కూడా అడ్మిషన్లు ఇస్తామని, ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదని తెలిపారు.

## వర్షానికి రైతుల ఇబ్బందులు

పాన్‌గల్, మే2: పాన్‌గల్ మండలకేంద్రంతోపాటు కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, రేమద్దుల, శాగాపూర్ చిక్కేపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పోగుచేసి బొడ్డెలపై కవర్లు కప్పారు. నేలపై నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టారు. వరికోతకు సిద్ధంగా వరిచేలు నేలకొరిగాయి. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకుండా జాప్యం చేసిన సింగిల్ విండో, ఐకేపీ సిబ్బందిపై రైతులు మండిపడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వర్షానికి కళ్లెదుటే తడిసిపోతుంటే చేసేదేమిలేక రైతన్నలు దిగాలు చెందుతున్నారు.

## ఉడిపి స్వామీజీకి సన్మానం

నారాయణపేట టౌన్, మే 2 : పట్టణంలోని పళ్లలో ఉన్న లక్ష్మీనారసింహ సహిత రాఘవేంద్రస్వామిని శుక్రవారం ఉడిపి అదిమారు పీఠాధిపతి విశ్వప్రియ తీర్థులు దర్శించుకున్నారు. విద్వాన్ అనిల్‌దేశాయి, అర్చకులు నర్సింహాచారి, శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు.

## కొనుగోలు కేంద్రం పరిశీలన

బిజినేపల్లి, మే 2: మండలంలోని లట్టుపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి చంద్రయ్య, వారి బృందం ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ 6వేల క్వింటాళ్లకుపైగా ధాన్యాన్ని విక్రయించడం జరిగిందని, కానీ రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

పాన్‌గల్, మే 2: అర్హులైన లబ్దిదారులకే ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని ఎంపీడీవో గోవింద్‌రావు అన్నారు. మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్దిదారుల ఇండ్లను శుక్రవారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు.